క్లుప్తంగా

21వ వార్డులో కమిషనర్ పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, అధికారులు

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు ఎస్కేడీ కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, టీపీఓ శ్రీనివాసులు పర్యటించారు. కౌన్సిలర్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధుల్లో తిరుగుతూ అక్రమ కట్టడాల గుర్తింపు, రోడ్లు, కాలువలు, కల్వర్టులను పరిశీలించారు. కాలువలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ టీపీఓను ఆదేశించారు. అక్రమ కట్టడాల వల్ల రోడ్లు కుదించుకుపోతున్నాయని, దీంతో అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రజలు సహకరిస్తే అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ అన్నారు. అనంతరం ఎన్‌జీవోస్ కాలనీలోని రాంజల రోడ్డు చిల్డ్రన్స్ పార్కు, మున్సిపల్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు బాషా అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం ముందు గ్రామస్తులతో కలిసి ధర్నా చేసి సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఆయకట్టు రస్తా గుంతలమయంగా మారిందని, వెంటనే గరుసు వేయాలన్నారు. ఎస్సీ కాలనీలో, లక్ష్మీపురం క్యాంపులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. సీపీఎం నాయకులు దస్తగిరి బాషా, సభ్యులు అబ్దుల్‌రహీం, పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతుకు నిధుల మంజూరు



ఆదోని–శిరుగుప్ప రహదారి

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలోని రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారుల్లో డబుల్ లేయర్ పనులతో పాటు కొత్తగా బీటీ రహదారులు, గోతులు పడిన ప్రాంతాల్లో కంకరతో పిచ్చింగ్ వేసి మరమ్మతు పనులు చేస్తారు. ఆదోని నుంచి శిరుగుప్పకు వెళ్లే రహదారి పనులకు గాను ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. దాదాపు 6 కిలో మీటర్ల మేర పనులు జరగనున్నాయి. ఆదోని మండలం కపటి గ్రామం నుంచి పెద్దతుంబళం వెళ్లే రహదారి వయా పెసలబండ, మాంత్రికి, దొడ్డనగేరి మీదుగా 13 కి.మీ రహదారి పనులకు రూ.2.8 కోట్లు మంజూరు చేసింది. పెద్ద పెండేకల్లు నుంచి చిన్నపెండేకల్లు రహదారి 9/22 నుంచి 13/22 వరకు దాదాపు 4 కి.మీ కొత్త బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.4 కోట్లు కేటాయించింది. అలాగే కుప్పగల్ నుంచి కుంటనహాలు రహదారి 6.80 కి.మీలకు రూ.2.50 కోట్లు. ఎమ్మిగనూరు నుంచి మాలబండి 6 కి.మీ పనులకు రూ.2.5 కోట్లు, పెద్దకడబూరు నుంచి దొడ్డిమేకల గ్రామానికి వెళ్లే రహదారి దాదాపు 10 కి.మీలకు రూ.2.3 కోట్లు, కోసిగి నుంచి హెచ్.మురవని మీదుగా ఉరుకుంద గ్రామానికి 4 కి.మీ రహదారి పనులకు రూ.90 లక్షలను కేటాయించింది. ఈ పనుల నిమిత్తం త్వరలో టెండర్లను పిలువనున్నట్లు రహదారులు భవనాల ఈఈ కె.క్రిష్టారెడ్డి తెలిపారు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డీఈఓ తనిఖీ

కోసిగి: మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఎస్‌డబ్ల్యూ, మోడల్ స్కూల్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యా కానుకలను పరిశీలించారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల ఓ ఉపాధ్యాయురాలి పట్ల జరిగిన అసభ్య ప్రవర్తన ఘటనకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. పాఠశాలలో అన్నీ వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ నాగేశప్ప, సీఆర్‌పీలు ఉన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

కౌతాళం: మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం తెలిపారు. గ్రామానికి తాగునీరు అందించే హనువాళు రక్షిత మంచి నీటి ఎస్ఎస్ ట్యాంకులో నీరు లేకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాలతో మూడు ట్రాక్టర్లలో ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకుకు నీరు వచ్చే వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు.

ప్యాకేజీ స్టార్.. నోరు అదుపు చేసుకో!



పెద్దకడబూరులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

పెద్దకడబూరు: టీడీపీ దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు షాబీర్‌షావలీ, గురుస్వామి, మంజునాథ్‌గౌడ్, చిరంజీవి, హాసాన్, బ్రహ్మయ్య తదితరులు డిమాండ్ చేశారు. వారాహి సభలో పవన్‌కళ్యాణ్ వలంటీర్లు ఒంటరి మహిళల అడ్రస్సులు సేకరించి హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నట్లు ఆరోపించడంపై వలంటీర్లు నిప్పులు చెరిగారు. స్థానిక సచివాలయం– 2 నుంచి దత్తపుత్రుడు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చి బస్టాండ్ ఆవరణంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ కరోనా సమయంలో హైదరాబాద్‌లో దాక్కున్న దత్తపుత్రుడికి వలంటీర్ల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. నిత్యం ప్రజా సేవలో పరితపిస్తున్న వలంటీర్లను చులకన చేసి మాట్లాడడం పవన్‌కు తగదని, బహిరంగ క్షమాపణ చెప్పకపోతే భవిష్యత్‌లో వలంటీర్ల తడాఖా చూపుతామని హెచ్చరించారు. వివిధ గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు.

కౌతాళం: ప్యాకేజీస్టార్ పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని కౌతాళం వలంటీర్లు హెచ్చరించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనుక్కి తీసుకోవాలని కోరుతూ కౌతాళంలో గ్రామ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న తమపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.



కౌతాళంలో నిరసన ర్యాలీ చేపట్టిన వలంటీర్లు

పర్యవేక్షణతోనే వ్యాధి నయమైంది



రసూల్‌బీకి మాత్రలు అందించి సూచనలు తెలియజేస్తున్న వలంటీర్ భారతి

కరోనా సమయంలో వలంటీర్లు ప్రతి ఇంటినీ ఆరోగ్య సర్వే చేసి వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి మాత్రలు పంపిణీ చేయడం, డాక్టర్ల వద్దకు తీసుకెళ్లడం జరిగింది. ఆ సమయంలో స్థానిక విక్టోరియాపేటలోని చౌకీ మఠం వద్ద రసూల్‌బీ అనే మహిళ పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తుండేది. రెండు మూడు రోజులుగా ఇంటికి తలుపులు వేసుకొని లోపలే అరుస్తూ ఉంది. విషయం తెలుసుకున్న 34వ వార్డు టీజీఎల్ కాలనీ వలంటీర్ భారతి ఆమె స్థితిగతులు తెలుసుకొని డాక్టర్ వద్దకు తీసుకెళ్లి సమయానికి మందులు అందజేసింది. ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ దాదాపు మూడేళ్లు సేవలందించడంతో రసూల్‌బీ కోలుకుంది.

వలంటీర్ లేకపోతే పిచ్చి ముదిరిపోయేది

మూడేళ్ల క్రితం వలంటీర్ భారతి గుర్తించకపోయి ఉంటే పిచ్చి బాగా ముదిరిపోయేది. ఆమె పర్యవేక్షణతోనే నేను కోలుకున్నారు. ఒంటరి మహిళనైన నన్ను డాక్టర్ వద్దకు తీసుకెళ్లి వైద్య చేయించింది. ప్రతిరోజూ మందులు వేసుకున్నానా లేదా అని తెలుసుకుంటూ పర్యవేక్షించేది. పెద్దమ్మా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ బాగోగులు చూసుకోవడంతో నేను పూర్తిగా కోలుకున్నాను. అలాగే ప్రతి నెలానెలా వితంతు పింఛన్ అందిస్తోంది. వలంటీర్ భారతి లేకపోయి ఉంటే నేను ఏమై పోయేదాన్నో అని రసూల్ బీ సంతోషం వ్యక్తం చేసింది. – రసూల్‌బీ, బాధితురాలు

ప్రజా సంక్షేమానికి 'జగనన్న సురక్ష'





ఆదోనిలో ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్, కోసిగిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ఆదోని టౌన్: జగనన్న సురక్ష' ప్రతి కుటుంబానికి రక్ష అని, ఈ కార్యక్రమం ద్వారా మునుపెన్నడూ లేనివిధంగా ప్రజలకు అవసరమైన కులం, ఆదాయం, నివాసం, అడంగళ్, పింఛన్, రేషన్ కార్డు, వితంతు, కుటుంబ విభజన తదితర ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా, సులువుగా పంపిణీ చేస్తోందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత తెలిపారు. మంగళవారం పట్టణంలోని 17, 18, 19, 21 వార్డుల సచివాలయాలు సంయుక్తంగా కేజీఎన్ ఫంక్షన్ హాలులో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు.

– 17వ వార్డులో 1210 దరఖాస్తులు రాగా 488 మందికి సమస్యలు పరిష్కారమయ్యాయి. అందులో 288 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 200 మందికి కుల ధ్రువీకరణ పత్రాలను అందించారు.

– 11వ వార్డులో 1,137 మంది దరఖాస్తులురాగా 1,076 పరిష్కారమయ్యాయి. కులం– 570, ఆదాయం– 506 సర్టిఫికెట్లను అందించారు.

– 14వ వార్డులో 1,445 దరఖాస్తులకుగానూ 1,432 పరిష్కారమయ్యాయి. ఆదాయ సర్టిఫికెట్లు 679, కుల ధ్రువీకరణ పత్రాలు 731, రేషన్‌కార్డులు 5, మ్యారేజ్ సర్టిఫికెట్ ఒకటి, రైస్ కార్డు విభజన 2, కుటుంబ విభజన సర్టిఫికెట్లు 2 పరిష్కారమయ్యాయి.

– 21వ వార్డులో 2320 దరఖాస్తులకు గానూ 1870 పరిష్కారమయ్యాయి. ఆదాయం సర్టిఫికెట్లు 1104, కుల సర్టిఫికెట్లు 1137 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేశారు.

ఏఒక్కరూ పథకాలకు దూరం కారాదు

పెద్దకడబూరు: రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలోని బస్టాండ్ ఆవరణంలో సర్పంచ్ జానకమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు దేశానికే తలమానికంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం వలంటీర్లకు అవార్డులు, ధ్రువీకరణ పత్రాలకోసం దరఖాస్తు చేసుకున్న వారికి 543 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పార్టీ పరిశీలకులు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కోసిగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోసిగి సచివాలయం–3లో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం సచివాలయం –4లో ఆధార్ సేవలను ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, సర్పంచ్ అయ్యమ్మ, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలోని బాపురం గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి బృందం, చిరుతపల్లి గ్రామంలో ఎంపీడీఓ సుబ్బారాజు బృందం ప్రజా వినతులకు పరిష్కారం చూపి అక్కడిక్కడే వివిధ రకాల సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఎంపీపీ అమరేష్ పాల్గొని దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఎంపీపీ బందాయి దానమ్మ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి సమక్షంతో మొత్తం వెయ్యికి పైగా లబ్ధిదారులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఒక్కరోజులోనే సర్టిఫికెట్లు ఇచ్చారు



నా పిల్లలు ప్రభుత్వ బడిలో చదువుకుంటున్నారు. అమ్మ ఒడి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్ కావాల్సి ఉండగా, వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ఒక్కరోజులోనే ఉచితంగా సర్టిఫికెట్లను అందించారు. వ్యయ ప్రయాసలు తప్పాయి – బసమ్మ, పెద్దతుంబళం

సురక్ష కార్యక్రమంతో ఉచితంగా పొందాను



మా కుటుంబంలో భార్య, భర్తలతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నాం. ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్నాం. జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా కుల, ఆదాయం సర్టిఫికెట్లను పొందాం. ఇప్పటివరకు మూడుసార్లు అమ్మ ఒడి, విద్యాదీవెన పథకం కింద లబ్ధి పొందాం. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

– అరుణభాయి, ఆర్టీసీ కాలనీ, ఆదోని

మంచి నిర్ణయం తీసుకున్నారు



ఇంతకుముందు కులం, ఆదాయ, నివాసం సర్టిఫికెట్లు కావాలంటే ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఎవరిని అడిగినా అక్కడికి వెళ్లు, ఇక్కడికి వెళ్లు అని తిప్పుకునే వారు. జగనన్న పాలనలో సర్టిఫికెట్లను మంజూరు చేసేందుకు సురక్ష కార్యక్రమం చేపట్టడం హర్షణీయం. మాలాంటి పేదలకు ఇళ్ల వద్దకే వచ్చి సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నారు. ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

– గోవిందమ్మ, ఇందిరానగర్, ఆదోని

ఉరుకుంద ఆలయానికి రూ. 2లక్షలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి మంగళవారం ఓ భక్తుడు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. హైదరాబాద్ వాస్తవ్యులు రాజుల సూర్యనారాయణరెడ్డి, రాజుల జోష్నారెడ్డి దంపతులు రూ.లక్షను రాజగోపుర నిర్మాణానికి దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. అలాగే రాజుల పునీత్ రెడ్డి పేరుపై రూ.లక్షను చెక్ రూపంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు,, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండును, స్వామివారి ఫొటోను అందజేశారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



పెద్దహరివాణంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో కొనసాగుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆరో రోజుగా పెద్దహరివాణం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కలియతిరిగి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలో మురుగు కాలువలు, డ్రెయినేజీలు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులను పిలిపించి మాట్లాడి పరిష్కార మార్గాలను చూపుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో వైఎస్ జగన్ మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చారని కొనియాడారు. జనసేన అధిసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలకు మరోసారి ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని స్పష్టం చేశారు. మరోసారి అఖండ మెజార్టీతో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైస్ ఎంపీపీ పుష్పలత, ఆర్‌బి జయరామిరెడ్డి, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఏపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలల భవితకు బంగారు బాట



ఫిజిక్స్ ల్యాబ్‌లో పరికరాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి: బాలల భవితకు రాష్ట్ర ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కోరమాండల్ కంపెనీ కోసిగి ఆదర్శ పాఠశాలలో రూ.8.25 లక్షలతో బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు, విద్యుత్ ఏర్పాటుకు రూ.40 వేలు, ల్యాబ్‌ల డిజైన్‌కు రూ.3 లక్షలు, వసతి గృహంలో రూ.3.25 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసింది. మంగళవారం ఎమ్మెల్యే, కోరమాండల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా సదరు ల్యాబ్‌లు, ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డిని కోరారు. విద్యలో ఉన్నతంగా రాణించే విద్యార్థులకు కోరమాండల్ తరఫున బహుమతులు అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కోఆర్డినేటర్ జయపాల్ షతూర్, ఏడీ శ్యాముల్ పాల్, ఏడీఏ గిరీష్, వ్యవసాయ శాస్త్రవేత్త సుజాతమ్మ, ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, ఏఓ రాజు, ఏంఈఓ–2 నాగేశప్ప, సర్పంచ్ అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోదాము నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్/పెద్దకడబూరు: పౌర సరఫరాల శాఖ మండల లెవెల్ స్టాక్ పాయింట్ గోదాము నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని మండలంలోని ఎస్.కొండాపురం, పెద్దకడబూరు మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలో స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గోదాము నిర్మించేందుకు అనుకూలమైన స్థల సేకరణ చేసి నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

సచివాలయం తనిఖీ

పెద్దకడబూరు మండలంలోని హనుమాపురం గ్రామ సచివాలయాన్ని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్, వివిధ రికార్డులను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. బీఎల్‌ఓల 6బీ రిపోర్టు 90 శాతం పైగా ఉండాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి షర్మిల, డీటీ రజనీకాంత్‌రెడ్డి, వలీబాష, పెద్దకడబూరు ఆర్‌ఐ మహేష్ తదితరులు ఉన్నారు.

నేటితో ముగియనున్న గడువు

ఆదోని సెంట్రల్: డిగ్రీ అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తుందని ఆదోని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహబుబ్ బాషా మంగళవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సాయంత్రం 5 గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవడానికి వెబ్ ఆప్షన్స్ నమోదు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గమనించి అయా తేదీలలో కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఎంపిక చేసుకొన్న కోర్సు, కళాశాలను బట్టి ఈ నెల 24వ తేదీన సీటు అలాట్‌మెంట్ జరుగుతుందని తెలిపారు.

ముగిసిన ఎల్లమ్మవ్వ వారాలు

ఎల్లమ్మవ్వ కొండలో కిక్కిరిసిన భక్తులు



ఆదోని అర్బన్: ఆషాఢమాసం తుది మంగళవారం సందర్భంగా ఎల్లమ్మకొండలో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మవ్వకు జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాభిషేకం, వెండి, బంగారు, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు జరిగాయి. మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు కొండ ప్రాంతంలో పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

డీయస్పీ, సీఐలు, ఎస్‌ఐలకు సన్మానం

ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐలు శ్రీనివాసనాయక్, నరసింహరాజు, ఎస్ఐలు రమేష్‌బాబు, జయశేఖర్‌లను ఎల్లమ్మవ్వ ఆలయ నిర్వాహకులు మంగళవారం సన్మానించారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి శాలువాలు వేసి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మవ్వ

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలసిన ఆంజనేయస్వామికి ఆషాఢమాసం మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాస నిత్యప్రసాద సేవాసమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వడలహారం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

వర్షం కోసం పూజలు

కౌతాళం: వర్షం రాక కోసం కౌతాళంలో మంగళవారం దేవాలయాలలో స్వామివారికి పూజలు చేసి 101 బిందెల నీటితో జలాభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెలన్నర గడిచినా వర్షం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షం కోసం గ్రామంలో వెలసిన మారికాంబదేవి, రామక్కమ్మవ్వ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి 101 బిందెల నీళ్లతో జలాభిషేకం నిర్వహించారు.